- హస్తం పార్టీని కాపాడాలంటూ శ్రేణుల ఆందోళన బాట
- ప్యారాచూట్ నేతలకు టికెట్ల కేటాయింపుపై అసంతృప్తిజ్వాల
- ఆదిలాబాద్‌లో ఆర్ఎస్ఎస్ కార్యకర్త కంది శ్రీనివాస్‌రెడ్డికి ఇవ్వడంపై తీవ్ర నిరసన

# సేవ్ కాంగ్రెస్ ఫ్రం ఆర్ఎస్ఎస్

ఆదిలాబాద్, అక్టోబర్ 30 (నమస్తే తెలంగాణ) : కాంగ్రెస్ టికెట్ల పంచాయతీ రోజురోజుకూ ముదురుతున్నది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో అధిష్ఠానం నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ వేలాది మంది నాయకులు, కార్యకర్తలు ఆందోళనబాట చేపట్టారు. ఆదివారం ఆదిలాబాద్ నియోజకవర్గంలో మైనార్టీ నాయకులు రాజీనామాలు చేయగా, సోమవారం ఆదిలాబాద్, బోథ్ నియోజకవర్గాల్లో సమావేశాలు నిర్వహించారు. ఇచ్చోడలో ర్యాలీ తీసి బోథ్ అభ్యర్థిని మార్చాలని డిమాండ్ చేశారు. ఆదిలాబాద్‌లో 'సేవ్ కాంగ్రెస్ ఫ్రం ఆర్ఎస్ఎస్' పేరిట సమావేశం ఏర్పాటు చేశారు. ఆదిలాబాద్ టికెట్‌ను కాంగ్రెస్ అధిష్ఠానం ఆర్ఎస్ఎస్ కార్యకర్త కంది శ్రీనివాస్‌రెడ్డికి అమ్ముకున్నదని నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. తాను చనిపోతే ఆర్ఎస్ఎస్ కండువా కప్పాలని సూచించిన వ్యక్తికి టికెట్ ఇస్తే ముస్లింలు ఓట్లు ఎలా వేస్తారని పేర్కొన్నారు. పార్టీని ప్రజల నుంచి దూరం చేయడానికే కాంగ్రెస్ పెద్దలు ఈ నిర్ణయం తీసుకున్నారని కార్యకర్తలు నిప్పులు చెరిగారు. ఎన్నో ఏళ్లుగా పార్టీ జెండాను మోస్తూ కష్టకాలంలో పార్టీకి అండగా ఉన్న నాయకులను కాదని ఇతరులకు సీట్లు ఎలా ఇస్తారని మండిపడ్డారు. ఆదిలాబాద్ టికెట్‌ను అధిష్ఠానం అమ్ముకుంటే ఎన్ఆర్ఐ కంది శ్రీనివాస్‌రెడ్డి కొన్నారని ఆరోపించారు. అలాంటి వ్యక్తి కోసం పనిచేసేది లేదని నాయకులు, కార్యకర్తలు స్పష్టం చేశారు. పార్టీ నిర్ణయాన్ని మార్చుకోవాలని హెచ్చరించారు. లేనిపక్షంలో పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి రామచంద్రారెడ్డి అల్లుడు సంజీవరెడ్డిని ఆదిలాబాద్ నియోజకవర్గం నుంచి రెబల్‌గా బరిలోకి దింపుతామని స్పష్టం చేశారు. టికెట్ ఆశించిన నాయకులు ఎన్నో ఏండ్లుగా పార్టీ జెండాను మోస్తున్నామని, కష్టకాలంలో కార్యకర్తలకు అండగా ఉన్న వారిని కాదని అధిష్ఠానం కేవలం డబ్బులున్న వారికి టికెట్ ఇచ్చిందని నిరసన వ్యక్తం చేశారు.



ఆదిలాబాద్‌లో జరిగిన సమావేశానికి హాజరైన కార్యకర్తలు

### బోథ్ నియోజకవర్గంలో ఆందోళన

బోథ్ టికెట్ విషయంలో అధిష్ఠానం నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ నాయకులు, కార్యకర్తలు ఆందోళన బాట పట్టారు. పార్టీ సీనియర్లు నరేశ్ జాదవ్, ఆడే గజేందర్ ఆధ్వర్యంలో ఇచ్చోడలో భారీ ర్యాలీ నిర్వహించి నిరసన తెలిపారు. పార్టీ కోసం దశాబ్దాలుగా సేవ చేస్తున్న వారిని కాదని కాంగ్రెస్ నాయకుడు ప్రేమ్‌సాగర్‌రావు సూచించిన వన్నెల అశోక్‌కు టికెట్ ఎలా ఇస్తారని ప్రశ్నించారు. బోథ్ అభ్యర్థి విషయంలో అధిష్ఠానం తన నిర్ణయాన్ని మార్చుకోవాలని, లేనిపక్షంలో తమ నిర్ణయాన్ని ప్రకటిస్తామని నాయకులు సూచించారు.

### రాజీనామా అయినా చేస్తా.. ఆర్ఎస్ఎస్ కార్యకర్తకు పనిచేయను



కాంగ్రెస్ అధిష్ఠానం టికెట్ ఇచ్చిన ఆర్ఎస్ఎస్ కార్యకర్త కంది శ్రీనివాస్‌రెడ్డి కోసం పనిచేసే ప్రసక్తి లేదు. అవసరమైతే రాజీనామా చేస్తా. అధిష్ఠానం నిర్ణయాన్ని తాను వ్యతిరేకిస్తున్నా. ఓడిపోయే వ్యక్తికి టికెట్ ఎందుకు ఇచ్చారు? కంది శ్రీనివాస్‌రెడ్డి కార్యకర్తలకు కనీస గౌరవం ఇవ్వకుండా ఇష్టానుసారంగా ప్రవర్తిస్తాడు. జిల్లా నాయకులను అల్లిగాడు, మల్లిగాడు అని సంబోధించే వ్యక్తిని ఎలా మద్దతు ఇవ్వాలి. ఎన్ఆర్ఐగా ఉంటూ పార్టీ టికెట్ కోసం బీజేపీలో చేరిన వ్యక్తి, అక్కడ టికెట్ రాదని తెలుసుకుని కాంగ్రెస్‌లో చేరాడు. డబ్బులు పోసి టికెట్ కొనుకున్నాడు. కష్టకాలంలో పార్టీ జెండా మోసిన నాతోపాటు టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సుజాత, సీనియర్ నాయకుడు సంజీవరెడ్డిని కాదని డబ్బులున్న కంది శ్రీనివాస్‌రెడ్డికి పార్టీ టికెట్ ఇచ్చింది. అధిష్ఠానం నాయకులు టికెట్‌ను అమ్ముకున్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పార్టీ కోసం పనిచేసిన వారిని కాదని ప్యారాచూట్ నాయకులైన ముథోల్ నుంచి నారాయణరావు పటేల్, ఆసిఫాబాద్ నుంచి శ్యాంనాయక్‌కు అధిష్ఠానం టికెట్ ఇచ్చింది. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి టికెట్ల పంపిణీ విషయంలో తప్పులు చేశాడు. డబ్బులతో టికెట్ కొనుగోలు చేసిన వ్యక్తి గెలిస్తే వచ్చే సర్పంచ్, మున్సిపల్, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో పార్టీ టికెట్‌లు అమ్ముకుంటాడు. సామాన్య కార్యకర్తలు నష్టం కలిగే ప్రమాదమున్నది. కంది శ్రీనివాస్‌రెడ్డి డబ్బులున్నాయనే అహంకారంతో పార్టీ సీనియర్లు, కార్యకర్తలను పట్టించుకోడు.

**- సాజిద్‌ఖాన్, ఆదిలాబాద్ డీసీసీ అధ్యక్షుడు**



### కార్యకర్తల నిర్ణయానికి కట్టుబడి ఉంటా

ఆదిలాబాద్ నియోజకవర్గ విషయంలో కార్యకర్తలు తీసుకున్న నిర్ణయానికి నేను కట్టుబడి ఉంటా. టికెట్ల పంపిణీ విషయంలో కాంగ్రెస్ అధిష్ఠానం డబ్బులుంటేనే రాజకీయాలు చేయాల్సిన పరిస్థితి సృష్టించింది. రాజకీయాల్లో ఉండాలంటే కేవలం డబ్బులుంటేనే సరిపోతుందా? డబ్బులున్నోళ్లకే సీట్ల కేటాయింపు జరిగింది. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి స్థానికంగా ముఖం చాటేసి, ఢిల్లీకి పోయి సీట్ల పంపిణీ చేపట్టారు. 2018లో ఆదిలాబాద్ నుంచి టికెట్ ఇచ్చినప్పుడు డబ్బులు కనపడలేదా..?

**- గండ్రత్ సుజాత, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి**

### సీనియర్లు పోటీలో ఉంటారు



ఆదిలాబాద్ టికెట్‌ను కాంగ్రెస్ అధిష్ఠానం సీనియర్‌ను కాకుండా వేరే వ్యక్తికి కేటాయించింది. ఆర్ఎస్ఎస్ నుంచి వచ్చిన వ్యక్తికి టికెట్ ఇవ్వవద్దని సూచించాం. ఈ రోజు జరిగిన సమావేశంలో డీసీసీ అధ్యక్షుడు సాజిద్‌ఖాన్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సుజాత, సీనియర్ నాయకుడు సంజీవ్‌రెడ్డిలో ఒకరిని పోటీలో నిలబెట్టాలని కార్యకర్తలు నిర్ణయం తీసుకున్నారు.

**- షేక్ ముబాకర్, కాంగ్రెస్ నాయకుడు, ఆదిలాబాద్**



ఇచ్చోడ : మండలకేంద్రంలో ర్యాలీ తీస్తున్న కాంగ్రెస్ నాయకులు



ఇచ్చోడ : సమావేశంలో అశోక్ మాకు వద్దంటూ చేతులెత్తిన కార్యకర్తలు

# మంత్రి కొప్పులకు జై

- 50వేల మెజార్టీతో గెలిపిస్తాం
- ధర్మపురిలో బీడీ టేకేదారుల తీర్మానం

ధర్మపురి, అక్టోబర్ 30: ధర్మపురి అభ్యర్థి, మంత్రి కొప్పుల ఈశ్వర్‌కు మద్దతు పెరుగుతున్నది. సకల జనం జై కొడుతున్నది. సోమవారం కొప్పుల ఈశ్వర్‌కు ధర్మపురిలోని బీడీ టేకేదారులు మద్దతు ప్రకటించారు. ధర్మపురిలోని ఎస్‌హెచ్ గార్డెన్స్‌లో సమావేశమయ్యారు. మంత్రి కొప్పుల ఈశ్వర్‌ను భారీ మెజార్టీతో గెలిపిస్తామని, తమ సంపూర్ణ మద్దతు బీఆర్ఎస్‌కేనంటూ ఏకగ్రీవ తీర్మానం చేశారు. అనంతరం వారు మాట్లాడారు. దేశంలో ఎక్కడా లేని విధంగా బీడీ కార్మికులకు పింఛన్ ఇస్తుండడంతో పాటు టేకేదారులు, ప్యాకర్లకు కూడా పింఛన్ ప్రకటించి మూడు నెలల నుంచి రూ.2016 అందించడం తెలంగాణ ప్రభుత్వం గొప్పతనమన్నారు. అన్ని వర్గాల గురించి ఆలోచించే ఇంత గొప్ప ప్రభుత్వాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. బీడీ టేకేదారులు, బీడీ కార్మికులు, ప్యాకర్ల సంపూర్ణ మద్దతు బీఆర్ఎస్‌కేనని చెప్పారు. కార్యక్రమంలో బీడీ టేకేదారుల సంఘం జిల్లా అధ్యక్షుడు మల్లారెడ్డి, ధర్మపురి మండలాధ్యక్షుడు బొద్దుల మల్లేశం, ఉపాధ్యక్షుడు కొంపల నర్సయ్య, టేకేదారు లు మ్యాన పూర్ణచందర్, మచ్చ సత్యం, గాడిచెర్ల మల్లేశం, శ్రీనివాస్, గంగారాం ఉన్నారు.

# మంథనిలో 4 గంటల వరకే పోలింగ్

- ఉత్తర్వులు జారీ చేసిన సీఈసీ

మంథని, అక్టోబర్ 30: మావోయిస్టు ప్రభావిత ప్రాంతమైన మంథని నియోజకవర్గంలో ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకే పోలింగ్ ప్రక్రియ కొనసాగుతుందని కేంద్ర ఎన్నికల సంఘం సోమవారం ప్రకటించినట్లు మంథని ఆర్‌వో హనుమానాయక్ తెలిపారు. మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల సరిహద్దు ప్రాంతమైన మంథని నియోజకవర్గంలో నక్సల్స్ గతంలో హింసాత్మక ఘటనలను దృష్టిలో ఉంచుకొని ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. తెలంగాణలో మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలైన మంథని, బెల్లంపల్లి, చెన్నూరు, మంచిర్యాల, సిర్పూర్, ఆసిఫాబాద్, భూపాలపల్లి, ములుగు, పినపాక, ఇల్లందు, కొత్తగూడెం, అశ్వారావుపేట, భద్రాచలంలో సాయంత్రం గంట పాటు సమయాన్ని సీఈసీ తగ్గించింది. ఇవి మినహా రాష్ట్రంలోని 106 నియోజకవర్గాల్లో ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు పోలింగ్ ప్రక్రియ కొనసాగుతుందని ప్రకటించింది.

నమస్తే తెలంగాణ CLASSIFIED
WANTED
jobs Apply Now!
★ రామకృష్ణ గ్రూప్ (TS & AP No. 1) Hyd., VJA. శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల సేవకు ఇంటి/వంట పని, బేబీకేర్ కొరకు వర్కర్లు (M/F) కావలెను. భో+వ+జీతం: 15-21 వేలు. ఏజెంట్లకు కమీషన్: 5,000/-. Ph: 9281452833, 6281208600.
NT-320535
CHANGE OF NAME
★ I, DUWWA VENKAT NARSAIAH, S/o. Duwwa Narshingam, H.No. 18-1, Keshava Nagar, Raikal, Jagityal, TS. Changed My Name as DUVVA VENKATA NARSAIAH, S/o. Duwwa Narshingam.
NT-320721
★ I, DUWWA SHARASWATHI, W/o. Duvva Venkata Narsaiah, R/o. 18-1, Keshava Nagar, Raikal, Jagityal, TS. Changed My Name as DUVVA SARASWATI, W/o. Duvva Venkata Narsaiah.
NT-320721
గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.
Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 91827 77571
91827 77194